క్లుప్తంగా

నేడు రంగోయిలో జానపద కళాజాతర

పలాస: రంగోయి గ్రామంలో శనివారం ఉదయం పంది గంటలకు జానపద జాతర నిర్వహిస్తున్నట్టు గిడుగురామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బద్రి కూర్మారావు శుక్రవారం తెలిపారు. కళాపీఠం 21వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి జానపద సంప్రదాయ పోటీలతో పాటు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా నలుమూలల నుంచి కళాకారులు తరలివస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కంచిలిలో మైక్ అనౌన్స్‌మెంట్ చేస్తున్న పోలీసులు

కంచిలి: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.పారినాయుడు సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు, వేరే ప్రాంతాలకు వెళ్లేవాళ్లంతా జాగ్రత్తలు పాటించాలని, విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచి వెళ్లవద్దని కోరతూ మైక్ ద్వారా శుక్రవారం వీధుల్లో ప్రచారం చేయించారు.

షర్మిల దృష్టికి జిల్లా సమస్యలు

కవిటి: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దృష్టికి తీసుకెళ్లినట్టు జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఆమెను కలిసి జిల్లాలో నెలకున్న సమస్యలను వివరించినట్టు పేర్కొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీలో వివక్ష!



సమస్యను చెబుతున్న లోహరిబంద గ్రామస్తులు

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద పంచాయతీ పరిధిలోని ప్రజలకు బియ్యం పంపిణీ, కందిపప్పు అందించడంలో వివక్ష చూపుతున్నారని గ్రామస్తులు శుక్రవారం ఆరోపించారు. పంచాయతీ పరిధిలో లోహరిబంద, గొల్లలపాలెం, పెద్దకొత్తూరు, చిన్న కొత్తూరు, యశోదనగర్, సింక్లాపుట్టుగ, చిన్నలోహరిబంద, కొత్తపేట, ధరంపురం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందడంలేదు. డీలర్ వద్దకు మాత్రం సరుకులు చేరుతున్నాయని.. రేషన్ పంపిణీ వాహనం మాత్రం గ్రామాల్లోకి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. సమస్యను సీఎస్ డీటీ మురపల్ల మురళీధర్‌కు తెలియజేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ ఆయన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెబుతున్నారు.

నేటి నుంచి రాష్ట్ర టెన్నీ కాయిట్ పోటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి టెన్నీ కాయిట్ పోటీలు, నిర్వహిస్తున్నట్లు టెన్నీ కాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాష్ట్ర పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తవిటయ్య తెలిపారు. ఈ సందర్భంగా మైదానంలో శుక్రవారం ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇందులో క్రీడాకారుల నైపుణ్యాన్ని అనుసరించి వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామని అన్నారు.

బాలామృతం పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. ఈదుపురం అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్‌తో కలిసి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు బాలసంజీవని బాలామృతాన్ని శుక్రవారం అందజేశారు. వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్ నర్తు వరప్రసాద్ పాల్గొన్నారు.

మందస ఎస్‌ఐగా కృష్ణప్రసాద్



కాశీబుగ్గ: మందస ఎస్‌ఐగా కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌కే బాషాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయగా.. అతని స్థానంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌ను నియమించారు. 2 నెలల తరువాత స్టేషన్‌కు ఎస్‌ఐ నియామకం జరిగింది.

కంచిలి: రేఖాదేవిపురం కూడలి నుంచి అర్జునాపురం గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు



అదే వేదన!



కంచిలి: భిన్నళ వద్ద రోడ్డు దుస్థితి..



కంచిలి: ఎక్కల గ్రామం వద్ద శిథిలమైన రోడ్డు

కంచిలి: కూటమి ప్రభుత్వ నాయకులు చెప్పిన మాటలకు.. చేతలకు పొంతనలేకుండా పోయింది. సంక్రాంతి పండుగ సమయానికి రోడ్లను తళతళ మెరిసేలా చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దల మాటలు ఆమలకు నోచుకోలేదు. దీనికి కంచిలి మండలంలోని పలు రోడ్ల పరిస్థితిని చూస్తే స్పష్టమవుతుంది. కంచిలి మండలంలో ఎంతో ప్రాధాన్యత గల రోడ్ల అభివృద్ధిని పట్టించుకునే వారే కరవయ్యారు. జాతీయ రహదారి జక్కర గ్రామం నుంచి కేసరపడ మీదుగా రేఖాదేవిపురం గ్రామం వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసన వర్షాలతో రోడ్డు పూర్తిగా శిథిలమై గోతులతో చిందరవందరగా తయారైంది. కానీ దీని మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం గోతులు పూడ్చేందుకు కూడా నిధులు మంజూరు చేయలేదు. సుమారు ఆరు కిలోమీటర్ల పొడవు గల ఈ రహదారి అడుగడుగునా గోతులతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ మార్గంలో జక్కర, సామంత జక్కర, కేసరపడ, ఎక్కల, బిన్నళకొత్తూరు, భిన్నళ, అర్జునాపురం గ్రామాలతోపాటు ఒడిశా సరిహద్దు గ్రామాలైన చీకటి కేసరపడ, మున్సీపేట, సంతోషిపురం, జరడ వరకు చాలా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా ఈ మార్గంలో సోంపేట నుంచి కుంబరినౌగాం రూట్‌కు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసు నడుస్తోంది. వందలాది మంది రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల రోడ్డుకు మరమ్మతులు చేయాలనే ఆలోచన కూటమి పార్టీల పెద్దలకు లేకపోవడంపై ఈ ప్రాంతీయులు గుర్రుమంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు మేల్కొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు..

కవిటి: మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న రోడ్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు మచ్చుకైనా కానరావడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఎనిమిది రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు కవిటి–నెలవంక, కవిటి–కొజ్జిరియా, కంచిలి మండలం ఆదివారం సంత ఎన్‌హెచ్–16 నుంచి బిగొనపపుట్టుగ జంక్షన్, జాడుపుడి ఆర్‌ఎస్–బొరివంక రోడ్లను మరమ్మతులు చేశారు. అయితే ఈ పనులు నాసిరకంగా ఉన్నాయన్న విమర్శలు జోరుగా వస్తున్నాయి. సాక్షాత్తూ ఇటీవల మండలస్థాయి అధికారులతో ప్రభుత్వ విప్ బి.అశోక్ నిర్వహించిన సమీక్షా సమావేశంలోనే టీడీపీ మండల అధ్యక్షుడు మణిచంద్రప్రకాష్ అధికారుల తీరుపై ప్రశ్నించారు. బిగొనపుట్టుగ–లోళ్లపుట్టుగ గ్రామాల మధ్య వేసిన రోడ్డు మరీ ఘోరంగా ఉంది. ద్విచక్ర వాహనం స్టాండ్ వేసిన చోట గొయ్యి పడిన పరిస్థితి ఉందంటే నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం పాటించలేదనే విషయం తేటతెల్లమైంది. మరికొన్ని రోడ్లకు మరమ్మతులు ఇంకా చేపట్టలేదు.



కవిటి: బిగొనపపుట్టుగ సమీపంలో తారుతక్కువగా ఉన్నచోట రాళ్లుతేలిన రోడ్డు



కవిటి: లోళ్లపుట్టుగ సమీపంలో టూవీలర్ స్టాండ్ వేసిన చోట గొయ్యిపడిన దృశ్యం

సంక్రాంతి వచ్చింది తుమ్మెద..



కాశీబుగ్గ: కాశీబుగ్గ రోటరీనగర్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో సంప్రదాయ వస్త్రదారణలో పిల్లలు



ఇచ్ఛాపురం రూరల్: స్వర్ణభారతి విద్యా సంస్థలో రంగవల్లిక వద్ద అమ్మాయిలు



టెక్కలి: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో భోగి మంటలు వేసి నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. పలు పాఠశాలల్లో ముందస్తు వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ ప్రాధాన్యతను పిల్లలకు ఉపాధ్యాయులు వివరించారు. భోగి మంటలను వేసి సందడి చేశారు. ముగ్గులు పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులతో పిల్లలు ఆకట్టుకున్నారు.

'వ్యవస్థలో లోపాలతో ఆడుకోవద్దు'

టెక్కలి: రెవెన్యూ వ్యవస్థలో ఉన్న లోపాలతో ఆటలాడుకోవద్దని, క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అంశాలపై సిబ్బందికి కనీస అవగాహన ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం టెక్కలిలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాండ్ బ్యాంకింగ్ అంశంలో భాగంగా భూముల కేటగిరీ వివరాలను తెలుసుకునే క్రమంలో కొంత మంది తహసీల్దార్, వీఆర్‌ఓలకు అవగాహన లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల వివరాలపై అవగాహన లేని హిరమండలం కోరాడ వీఆర్‌ఓ రూపావతిని సస్పెండ్ చేయాలని, సంతబొమ్మాళి మండలం మర్రిపాడు వీఆర్‌ఓ కామేశ్వరరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ సమావేశానికి అత్యధికంగా వీఆర్‌ఓ గైర్హాజరై సెలవుల్లో ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఈ–ఆఫీస్ నిర్వాహణపై అవగాహన లేకపోవడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.



టెక్కలిలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కనే జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆధ్యాత్మిక శోభ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఊరూరా ఆధ్యాత్మిక శోభ నెలకుంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వేంకటేశ్వరస్వామితోపాటు వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. పలు ఆలయాల్లో వైభవంగా దీపోత్సవం జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



కంచిలిలోని వేంటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం



కాశీబుగ్గ: పలాస వేంకటేశ్వరస్వామికి తులసీ పత్రాలతో పూజలు



సోంపేటలో పూజలందుకున్న సత్యన్నారాయణ స్వామి



టెక్కలి: వైభవ వేంకటేశ్వర ఆలయంలో భక్తులు



కంచిలిలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



కవిటి: బెజ్జిపుట్టుగలో పూజలందుకుంటున్న చక్రధరస్వామి



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి సీతారామాలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



కంచిలి: పెద్దకొజ్జిరియా లక్ష్మీనరసింహ ఆలయంలో దీపోత్సవంలో భక్తులు



కవిటి: లోళ్లపుట్టుగలో ఉత్తరద్వార దర్శనానికి బారులుదీరిన భక్తులు



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబాళె వెంకటేశ్వర ఆలయం ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు



ఇచ్ఛాపురం: వేంకటేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



నందిగాం మండలం పెంటూరు వేంకటేశ్వర ఆలయంలో భక్తుల పూజలు



కాశీబుగ్గ: మందస పెరుమాళ్ ఆలయం వద్ద మహిళల పూజలు



వజ్రపుకొత్తూరు రూరల్: పూజలు అందుకుంటున్న స్వామివారు



కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి తిరువీధోత్సవంలో స్వామి వారి వేషధారణలో..

కళాశాలలో వేడుకలు..

విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు అన్నారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫెయిర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

–సోంపేట



భయాన్ని విడనాడాలి..

విద్యార్థులు హిందీ భాషను నేర్చుకోవడానికి ఆసక్తి చూపాలని.. భయం ఉంటే విడనాడాలని హిందీ ప్రచారకుడు, బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా సూచించారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీపై పట్టుసాధించడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసే ప్రక్రియలో బోధన సామగ్రిని ఉపయోగించి బోధించి ఉత్సాహపరిచారు.

–కంచిలి



రోడ్డు పనులు ప్రారంభం

పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో రూ.1.96 కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులు శుక్రవారం శుక్రవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నారాయణరెడ్డి, నాయకులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, కిక్కిర డిల్లీరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

–పలాస



విద్యార్థినికి సత్కారం

మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి గత ఏడాది ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బైపీసీ విద్యార్థిని బొర్ర కుమారి రోణను కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ బి.తేజశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ఏజీఎంవో, జంతు శాస్త్ర అధ్యాపకులు చింతాడ శరత్‌బాబు విద్యార్థినికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు.

–కాశీబుగ్గ

